నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



హుండీలను బస్సులోకి ఎక్కిస్తున్న హమాలీలు

## మేడారం హుండీల తరలింపు

### హనుమకొండ టీటీడీ కల్యాణ మండపానికి చేరవేత

### బుధవారం నుంచి లెక్కింపు ప్రారంభం

తాడ్వాయి, ఫిబ్రవరి 26 : మహాజాతర సందర్భంగా సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై ఏర్పాటు చేసిన హుండీలను సోమవారం దేవాదాయ శాఖ అధికారులు హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపానికి తరలించారు. సుమారు 462 ఇనుప హుండీలు, 30 బట్ట హుండీలు భక్తుల కానుకలతో నిండాయి. వాటిని ఆర్టీసీ బస్ క్యారియర్లలో తహసీల్దార్ రవీందర్, మేడారం ఈవో రాజేంద్రం ఆధ్వర్యంలో తరలించగా రాత్రి 12గంటలకు హనుమకొండ చేరాయి. బుధవారం నుంచి హుండీల ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు.

## పరిశోధనలో తెలుగు ఆచార్యుల కృషి భవిష్యత్ తరాలకు ఆదర్శం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 26 : కేయూ తెలుగు విభాగం ఆచార్యుల పరిశోధన కృషి సాహితీ ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని మాజీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. కేయూ తెలుగు విభాగం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో సోమవారం సెనేట్ హాల్‌లో ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుల సాహిత్య సేవ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. తెలుగు విభాగం పూర్వ ఆచార్యులు సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో రచనలు చేశారన్నారు. వారి సాహిత్య కృషి భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమన్నారు. అనంతరం సదస్సు ప్రారంభకులు ఆచార్య సుప్రసన్నాచార్య, ఆచార్య కాత్యాయని విద్మహే, ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడారు. మంథని శంకర్, చిర్ర రాజు, చింతం ప్రవీణ్, ఆగపాటి రాజ్‌కుమార్, అన్నపూర్ణ, కర్రె సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.



## జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్..!

**ఎర్రగట్టు గుట్ట వద్ద వాహదారుల ఇబ్బందులు**


- ఇరుక్కుపోయిన సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులు
- పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు

నగరంలోని ఎర్రగట్టు గుట్ట జంక్షన్‌లో సోమవారం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే అక్కడ ట్రాఫిక్ పోలీసులు ఎవరూ లేకపోవడంతో ఎవరి దారిన వారు వెళ్లడంతో గజిబిజిగా మారింది. అదే సమయంలో ఆ దారిన పరీక్షలు రాసేందుకు వెళ్తున్న సీబీఎస్ఈ పదో తరగతి విద్యార్థులు ఇరుక్కుపోయారు. ఓ వైపు సమయం అవుతుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కంగారు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో చివరకు స్థానికులే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సి వచ్చింది. ఇలా గంట పాటు ఆ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో నగరవాసులు పోలీసుల తీరుపై అసహనం వ్యక్తంచేయడం కనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



హనుమకొండ నుంచి కరీంనగర్, అంబాల, పరకాల వెళ్లే రహదారిలో ఎర్రగట్టు జంక్షన్‌లో ట్రాఫిక్ దృశ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## జై తెలంగాణ అనడమే తప్పా..?

**బీఆర్ఎస్ నాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

- లేదంటే 28న ఆత్మకూరులో పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం
- మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆందోళన నిర్వహిస్తాం
- పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- తప్పుడు కేసులు పెట్టి చిత్రహింసలు పెట్టారు : బాధిత కుటుంబసభ్యులు

*పరకాల, ఫిబ్రవరి 25: 'జాతరలో జై తెలంగాణ అని నినాదాలు చేయడమే తప్పా..? అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి లాక్కెళ్లి కొడ్తారా? బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టిన పోలీసులపై రెండు రోజుల్లోగా చర్యలు తీసుకోకుంటే ఈనెల 28న ఆత్మకూరులో పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం' అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.*

బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి రాత్రికి రాత్రే అరెస్టులు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఈ నెల 28న ఆత్మకూరులో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులతో కలిసి అగ్రంపహాడ్‌లో సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శనానికి వెళ్లగా నాయకులు, కార్యకర్తలు జై తెలంగాణ అని నినాదాలు చేశారని పేర్కొన్నారు. ఇలా నినాదాలు చేసినందుకే పోలీసులు వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి రాత్రికి రాత్రే పోలీస్ స్టేషన్లకు తరలించి థర్డ్ డిగ్రీ ప్రయోగించి తీవ్రంగా గాయపరిచారని, ఈ ఘటనపై తాము వరంగల్ సీపీకి ఫిర్యాదు చేయగా శాఖాపరమైన దర్యాప్తుకు ఆదేశించారని చెప్పారు. రెండురోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి చర్యలు తీసుకుంటామని సీపీ పేర్కొన్నారని తెలిపారు. రేపటితో రెండు రోజుల గడువు పూర్తవుతుందని, సీపీపై నమ్మకంతో రేపటి వరకు వేచి చూస్తామని, లేదంటే ఈ నెల 28న ఆత్మకూరు మండలకేంద్రంలో ధర్నా చేస్తామని చల్లా హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు ధర్నాలో పాల్గొంటారని, బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, దామెర వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్ఎస్ నాయకులు గోల్కొండ శ్రీనివాస్, కన్నెబోయిన రమేశ్ పాల్గొన్నారు.

### చిత్రహింసలు పెట్టారు : బాధిత కుటుంబసభ్యులు

ఆత్మకూరు : ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేసి రాత్రివేళ అక్రమంగా అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి తప్పు చేయని తమ భర్తలను అకారణంగా చిత్రహింసలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రంపహాడ్ జాతరలో శుక్రవారం రోజున బీఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ అనడమే తప్పయిందని, ఈ కారణంతోనే థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. కేసుల్లో బలం లేకున్నా, మర్డర్లు, మానభంగాలు చేసిన వాళ్లను తీసుకుపోయినట్లు, ఉగ్రవాదులను తీసుకుపోయినట్లు పోలీసులు అర్ధరాత్రి తమ ఇండ్లలో చొరబడి తమవాళ్లను లాక్కెళ్లారని చెప్పారు. అసలు వాళ్లు చేసిన నేరమేమిటో పోలీసులు చెప్పాలని, చీకటి రాజకీయాలు కాదని, మీడియా ముందు చెప్పాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

### బీఆర్ఎస్ నాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులపై డీసీపీ విచారణ

*బాధితుల నుంచి వాంగ్మూలం సేకరణ*

సుబేదారి, ఫిబ్రవరి 26 : బీఆర్ఎస్ నాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులపై డీసీపీ అబ్దుల్ బారి విచారణ చేపట్టారు. ఈ నెల 23న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అగ్రంపహాడ్ జాతరకు వెళ్లిన సమయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జై తెలంగాణ, జై చల్లా నినాదాలు చేయడంతో వారిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. పరకాల ఏసీపీ, ఆత్మకూరు సీఐ సమక్షంలో ఎస్సై ప్రసాద్ సుబేదారిలోని కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో 12మందిని విపరీతంగా కొట్టారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు, బాధితులతో కలిసి సీపీని కలిశారు. ఏసీపీ, సీఐ, ఎస్సై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ బారి ఆదివారం రాత్రి బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

### కాటారం మండలం దంతాలపల్లిలో విషాదం

కాటారం, ఫిబ్రవరి 26 : అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దంతాలపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై అభినవ్, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్(48) వ్యవసాయం చేస్తుంటాడు. ఈ ఏడాది మూడెకరాల సొంత భూమితో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నాడు. రెండున్నర ఎకరాల్లో రూ.4.50 లక్షల పెట్టుబడితో మిర్చి పంట, మరో మూడున్నర ఎకరాల్లో రూ.2.50 లక్షల పెట్టుబడితో పత్తి పంట సాగు చేశాడు. తెగుళ్లు వచ్చి మిర్చి పంట దెబ్బతినగా, ప్రతికూల పరిస్థితుల్లో పత్తి దిగుబడి రాలేదు. దీంతో సుమారు రూ.7లక్షల వరకు అప్పుల అయ్యాయి. ఆయన ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. చిన్న కుమారుడు అక్షయ్ చదువు కోసం రూ.1.30 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చలేనని తీవ్ర మనోవేదనకు గురైన శ్రీనివాస్ సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో మహదేవపూర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)


## ఆర్ఐపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

- ఇండ్ల స్థలాలు ఇప్పిస్తానని విలేకరుల నుంచి డబ్బులు వసూలు
- వెలుగుచూస్తున్న ఆర్ఐ మోసాలు



అదనపు కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు ఫిర్యాదు చేస్తున్న పెర్క రమాకాంత్

కమలాపూర్, ఫిబ్రవరి 26 : తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ–1గా విధులు నిర్వర్తిస్తున్న అశోక్‌రెడ్డి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రెండేళ్ల క్రితం బదిలీపై వచ్చిన ఆర్ఐ డబ్బులు ఇవ్వనిదే పని చేయడనే ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్ పత్రికల్లో విలేకరులుగా పనిచేస్తున్న వారికి నివేశన స్థలాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు 'సంభవం' పీడీఎఫ్ పత్రిక రిపోర్టర్, కన్నూరుకు చెందిన పెర్క రమాకాంత్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. గత ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలు ఇవ్వాలనే ప్రతిపాదన తీసుకురావడంతో సదరు ఆర్ఐ ఇదే అదనుగా భావించి ఒక్కొక్కరి వద్ద రూ.10 నుంచి 30వేలు వసూలు చేసినట్లు తెలిపారు. నివేశన స్థలాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే దాటవేస్తున్నాడని, ఆరు నెలలుగా ఇబ్బంది పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. ధరణిలో తప్పొప్పులను సవరించేందుకు అనేక మంది రైతుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు విమర్శలున్నాయి. భూముల ధరలు పెరగడం, జిల్లాకేంద్రానికి సమీపంలో ఉండడంతో భూ సమస్యల పరిష్కారం కోసం ఆర్ఐ అడిగినంత ముట్టజెప్పినా, సమస్యను పట్టించుకోకపోయేదని ఆరోపణలున్నాయి. కల్యాణలక్ష్మి చెక్కులు, మట్టి తరలించే ఎక్సకవేటర్ల నిర్వాహకుల నుంచి మామూళ్లు, పెద్ద చెరువులో నీళ్లు ఖాళీ చేయించేందుకు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నట్లు అభియోగాలు ఉన్నాయి. కలెక్టర్ ఆర్ఐపై విచారణ జరిపితే మరెన్నో అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.



మేయర్ గుండు సుధారాణికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

## అత్యవసర 'కౌన్సిల్' ఏర్పాటు చేయాల్సిందే..

### లేకుంటే బడ్జెట్ సమావేశం బహిష్కరిస్తాం

### మేయర్‌కు కార్పొరేటర్ల అల్టిమేటం

వరంగల్, ఫిబ్రవరి 26 : డివిజన్లలో పేరుకుపోతున్న సమస్యలు.. పెండింగ్‌లో వందల కోట్ల అభివృద్ధి పనులు.. వెరసి ప్రజల్లో తిరుగలేక పోతున్నామని, వెంటనే అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని అన్ని పార్టీల కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్‌లో సుమారు 45 మంది సభ్యులు సమావేశం నిర్వహించారు. మేయర్ కార్పొరేటర్లను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికై దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు డివిజన్లలో రూ.50 లక్షల పనులు చేయలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే కౌన్సిల్ సమావేశం నిర్వహించకుంటే బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరిస్తామని కార్పొరేటర్లే మేయర్‌ను హెచ్చరించారు. వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుంటే మేయర్‌కు సహకరించేది లేదని తేల్చిచెప్పారు. సమావేశం అనంతరం మేయర్ గుండు సుధారాణిని వినతిపత్రం అందజేశారు. మేయర్ చాంబర్‌లో కలిసిన కార్పొరేటర్లు పలు అంశాలపై వాగ్వాదానికి దిగారు. సమావేశం నిర్వహించకుంటే అవిశ్వాసానికి వెనుకాడేది లేదని తేల్చి చెప్పారు.

**మంత్రి, ఎమ్మెల్యేలను కలుస్తాం : సుధారాణి**

నగర సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల అంశాలను మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలను కలిసి వివరిస్తామన్నారు. వారిని కలిసిన తర్వాత కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. అనేక అభివృద్ధి పనులు నిలిచిపోవడానికి నిధుల కొరత కారణమని చెప్పారు.



ధర్నా చేస్తున్న నిర్వాసితులతో మాట్లాడుతున్న జెన్కో సీఈ సిద్ధయ్య

## డేంజర్ జోన్‌లోని గృహాలను తీసుకోవాలి

### ఏఎమ్మార్ కంపెనీలో నిర్వాసితుల ధర్నా

మల్హర్, ఫిబ్రవరి 26 : డేంజర్ జోన్‌లో ఉన్న గృహాలను తీసుకునే వరకూ బొగ్గు తవ్వకాలు చేపట్టొద్దంటూ సోమవారం తాడిచర్ల భూ నిర్వాసితులు ధర్నా చేశారు. ఏఎమ్మార్ కంపెనీ కొన్ని సంవత్సరాలుగా గృహాలను తీసుకుంటామని సర్వే చేసి ఇప్పటివరకూ తీసుకోలేదంటూ ఆందోళనకు దిగారు. దీంతో బ్లాస్టింగ్‌లతో ఇళ్లలోకి దుమ్ము, ధూళి వచ్చి శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించే దాకా బొగ్గు తవ్వకాలను నిలిపివేయాలని మైన్‌లో పనులను అడ్డుకున్నారు. కంపెనీ అధికారులు, కాటారం డీఎస్పీ వచ్చి నచ్చజెప్పినా వినలేదు. జెన్కో సీఈ వచ్చి హామీ ఇచ్చే వరకూ ఆందోళన ఆపేది లేదని ఆందోళనకారులు తేల్చిచెప్పారు. దీంతో కంపెనీ అధికారులు సీఈకి సమాచారం ఇవ్వగా ఆయన వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలే అవుతున్నదని, నాలుగు నెలల సమయం ఇస్తే జెన్కో బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బండి స్వామి, రావుల ఆంజనేయులు, ఆర్ని సత్యనారాయణ, రామిడి గట్టయ్య, నిర్వాసితులు పాల్గొన్నారు. కాటారం సీఐ నాగార్జునరావు, కొయ్యూరు, కాటారం ఎస్సైలు నరేశ్, అభినవ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## నలుగురు సీఐల బదిలీ

సుబేదారి, ఫిబ్రవరి 26 : వరంగల్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలు, 14మంది ఎస్సైలను బదిలీ చేస్తూ సోమవారం సీపీ అంబర్ కిశోర్‌ఝా ఉత్తర్వులు జారీ చేశారు. దుగ్గొండి సీఐ శ్రీనివాస్ పర్వతగిరికి బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న రాజగోపాల్ దుగ్గొండికి బదిలీ అయ్యారు. వరంగల్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న మహేందర్ ధర్మసాగర్‌కు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న విశ్వేశ్వర్ వరంగల్ పీసీఆర్‌కు బదిలీ అయ్యారు. అలాగే మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న పర్వతగిరి, అక్కడ పనిచేస్తున్న వీరభద్రరావు కమలాపూర్, పరకాలలో పనిచేస్తున్న మునావత్ రమేశ్ కమాలపూర్, వీఆర్‌లో ఉన్న నరేశ్ సంగెంకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న భరత్ జనగామ, టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న నరసింహారావు జనగామ, హనుమకొండలో పనిచేస్తున్న రామరావు వీఆర్, ధర్మసాగర్‌లో పనిచేస్తున్న బండారి రాజు వీఆర్, కాజీపేట ట్రాఫిక్‌లో పనిచేస్తున్న రామారావు నర్సంపేట, వరంగల్ సీసీఎస్‌లో పనిచేస్తున్న రాజేందర్, సంపత్‌కుమార్, బాపురావు, విద్యాసాగర్, రాజు వీఆర్‌కు బదిలీ అయ్యారు.